1

# యేసు, దైవం మరియు మానవుడు

## (1; 2; 4:14-16)

క్రొత్త నిబంధనలోని అన్ని గ్రంథముల వలె హెబీ పత్రిక కూడ యేసును గురించినదే! ఈ పత్రికలో ఆయన "మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుడు మరియు ప్రధాన యాజకుడుగా" (3:1), "మన విశ్వాసమునకు కర్త మరియు కొనసాగించువాడుగా" (12:2), "గొర్రెల గొప్ప కాపరిగా," "మన ప్రభువుగా" (13:20) కనబడుతున్నాడు. మన పాపములను తీసివేయుటకు అర్పించబడిన బలి ఆయన (9:26), మరియు ఆయన "నిన్న, నేడు యుగయుగములకు ఒక్కటేరీతిగా ఉండువాడు" (13:8).

మొదటి రెండు అధ్యాయములలో యేసుని గురించి చెప్పబడిన రెండు ప్రాముఖ్య విషయాలు – ఆయన దైవత్వము మరియు మానవీయత.[1] క్రీస్తు యొక్క దైవత్వము మరియు మానవీయత గురించి, అలాగే ఆయన దైవత్వం/మానవీయత గురించిన పర్యవసానం గురించి ఈ రెండు అధ్యాయములు చెప్తున్న విషయాలను కూడ చూద్దాము.

### యేసు దైవం

1వ అధ్యాయంలోని యేసుని దైవత్వము గురించిన వాస్తవాన్ని చూద్దాము. యేసుని గురించి ఈ అధ్యాయం ఏం చెబుతుంది.

*యేసు దేవుని కుమారుడు మరియు ఆయన ప్రతినిధి* (1:1, 2ఎ). నిజానికి ఆయన దేవుని ప్రతినిధులందరిలోను శ్రేష్ఠుడు. "పూర్వకాలమందు ... ప్రవక్తలద్వారా మన పితరులతో మాట లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను." దేవుని వాక్యమును ఆయన సొంత కుమారునిద్వారా స్వీకరించడం ఒక ప్రవక్తద్వారా స్వీకరించడం కంటె ఎంతో ఘనమైనది.

యేసు ద్వారా దేవుడు ఈ లోకమును సృజించి దాని నిర్వహిస్తున్నాడు (1:2బి, 3బి). ఆయన కుమారుడైన యేసుక్రీస్తుద్వారా దేవుడు సృష్టి కార్యమును ముగించాడు (చూడు యోహాను 1:1–14). సమస్తమును సృజించడంతోనే ఈ లోకంతో దేవుని పని అయిపోలేదు. ఈ లోకం ఇంకనూ నిర్వహింపబడుతున్నదంటే దేవుడు దానిని తన కుమారుని ద్వారా "నిర్వహిస్తున్నందువల్లనే"!

*యేసు దేవుని వంటివాడు;* దైవత్వపు లక్షణాలు ఆయనలో ఉన్నాయి; "ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్త్వముయొక్క మూర్తిమంతమునైయున్నాడు" (1:3ఎ). యేసునకు ఇదే గుణం ఉంది (చూడు ఫిలిప్పీయులకు 2:5–9).

*యేసు "పాపముల విషయంలో శుద్ధీకరణము చేసి,"* ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని *"కుడిపార్శ్వమున కూర్చుండెను"* (1:3సి). దైవత్వం ఉన్నవారు మాత్రమే పాపములకు శుద్ధీకరణం చేయగలరు; దైవం మాత్రమే దేవుని కుడిపార్శ్వమున కూర్చొనగలరు. యేసు దైవమే!

*యేసు దైవమైనందున, దూతల కంటె శ్రేష్ఠుడు* (1:4–14). యేసు దూతల కంటే శ్రేష్ఠుడు అన్న సత్యమును 1వ అధ్యాయం మిగతా భాగంలో చూస్తున్నాము. ఎందుకు ఆయన శ్రేష్ఠుడు? ఎందుకంటె ప్రాథమికంగా ఆయన దేవుని కుమారుడు, దూతలు అలాకాదు. యేసును దేవుని కుమారుడని పిలుస్తుండగా, అలా దూతలను ఎన్నడూ పిలువలేదు (1:5, 6). తరువాతదిగా, యేసు మరియు దూతలకు మధ్యగల భేదమును గ్రంథకర్త వివరిస్తున్నాడు. (a) ఆయన ఆరాధింపబడుతుండగా, దేవదూతలు ఆయన్ను ఆరాధిస్తున్నారు (1:6). (b) దూతలు సేవకులు కాగా, యేసు రాజ్యమును పాలిస్తున్నాడు (1:7–9). (c) ఒక రోజున నాశనమయ్యే భూమికి ఆయన సృష్టికర్త. ఆయన దేవుని కుడి పార్శ్వమందు కూర్చుండి పాలన చేయుచుండగా (1:10–13); "రక్షణయను స్వాస్థ్యము పొందబోవువారికి" (1:14) (క్రైస్తవులకు) సేవచేయువారుగా దూతలు ఉన్నారు.

ఈ సత్యములు మనకు ఏ విధంగా సంబంధించియున్నాయి? ఒక వ్యక్తి క్రీస్తువలన రక్షణ పొందగోరినట్లయితే, యేసు దేవుని కుమారుడని మరియు ఆయన దైవమని నమ్మవలెను (చూడు యోహాను 8:24)! యేసుని కుమారత్వం, ఆయన దైవత్వం, మరియు ఈనాటికీ ఆయన దేవుని ప్రతినిధియైయున్నాడన్న సత్యం యొక్క పర్యవసానములను గురించి గ్రంథకర్త హెబ్రీయులకు 2:1–4లో వివరిస్తున్నాడు.

## యేసుని దైవత్వము ఎందుకు ప్రాముఖ్యము గలది?

యేసుని గుర్తింపు యొక్క ప్రాధాన్యత ఈ వచనాలలో వివరించబడింది: మనము వినిన సంగతులను విడిచిపెట్టి "కొట్టుకొని పోకుండునట్లు" వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను (2:1). ఈ విషయాన్ని వివరించుటకు గ్రంథకర్త పాత నిబంధన ధర్మశాస్త్రమును ఉదహరిస్తున్నాడు. ఎందుకనగా "దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము [ఇది మోషే ధర్మశాస్త్రము] స్థిరపరచబడినందున [ఇది సత్యమని అతని పాఠకులు అంగీకరించియుంటారు] ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన, ప్రతిఫలము పొందియుండగా, ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యముచేసినయెడల ఏలాగు తప్పించుకొందుము?" (2:2, 3). మొదటిగా, ఈ పత్రికను చదివినవారు దీనిని కాదనలేరు – కాబట్టి వారికి తప్పించుకునే మార్గం ఉండదు!

దేవుడు తన కుమరుని ద్వారా మాట్లాడాడు అన్నది ఈ వాక్య భాగం యొక్క ముఖ్య విషయం; కాబట్టి మనం ఆయన మాటను వినాలి లేకపోతే మనం నిత్యత్వ పర్యవసానాలను ఎదుర్కొనాల్సి యుంటుంది!

ఇది చేయాలి అని కొంతమంది చెప్పినప్పుడు మనం వారి మాటను వినాలి. పిల్లలు తమ తలిదండ్రుల మాటను వినాలి. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల మాటను వినాలి. అలాగే ఉద్యోగస్థులు తమ అధికారుల మాటను వినాలి. అలాగే పౌరులు పోలీసుల మాటను వినాలి. అధికారంలోనున్నవారి మాటను మనం వినలేకపోతే మనం సమస్యలో పడతాము. అయితే దేవుని ప్రతినిధియై, దైవత్వము కలిగియున్న యేసు క్రీస్తు మాటను మనం తిరస్కరిస్తే, మనం ఇంకెంత సమస్యలలో పడిపోతాము!

## యేసు మానవుడు

క్రీస్తు యొక్క దేవత్వము గురించి మాట్లాడిన తరువాత గ్రంథకర్త యేసుని మానవత్వము గురించి మాట్లాడుచున్నాడు. హెబ్రీయులకు 2:5–18లో చెప్పబడిన క్రీస్తు మానవత్వము గురించి ఆలోచించండి. క్రీస్తు మరియు దూతల మధ్యగల భేదము ఈ వాక్య భాగంలోను కొనసాగింపబడింది. 1వ అధ్యాయంలో యేసు దూతల కంటె శ్రేష్ఠుడు అని చెప్పబడింది. ఎందుకంటే ఆయన దేవుడు కాబట్టి, 2వ అధ్యాయములో యేసు దూతల కంటె శ్రేష్ఠుడు అని చెప్పబడింది. ఎందుకంటె ఆయన మనుష్యుడు అయ్యాడు. ఉదాహరించబడిన వాక్యభాగంలో (కీర్తన 8:4–6 నుండి) దేవుడు, ఈ లోకమును దూతల ఆధీనం చేస్తానని వారికి వాగ్దానం చెయ్యలేదు అని గ్రంథకర్త పేర్కొంటున్నాడు. అలాగాక, ఆయన మనుష్యులకు ఈ వాగ్దానం చేశాడు. ఆధీనముచేయబడుతుందన్న వాగ్దానం ఈ లోకంలో నెరవేరలేదు గాని (2:8బి); "దూతల కంటె కొంచెం తక్కువవానిగా చేయబడిన" (2:9) యేసునందు ఇది నెరవేరింది. ఆయన "మహిమా ప్రభావములతో కిరీటం" ధరింపచేయబడియున్నాడు. కాబట్టి కీర్తన నెరవేర్పు ఆయనలో జరిగింది.

ఇంతగా ఘనపరచబడిన ఈ యేసు ఎవరు? ఆయన మానవుడై జీవించాడు: (a) ఆయన శ్రమతోకూడిన వేదనను పొందాడు (2:9, 14); శరీరంగలవారే మరణిస్తారు. (b) ఆయన మరియు ఆయన రక్షించిన మనుష్యులు ఒకే మూలమునుండి వచ్చారు (2:10, 11). (c) మనుష్యులను ఆయన తన సోదరులని పిలుస్తున్నాడు (2:11బి–13). (d) మనుష్యులతో ఆయన "శరీరం, రక్తమును" పంచుకున్నాడు (2:14). (e) దూతలకు సహాయం చేయడం కంటే, ఆయన శరీర రక్త సంబంధులైన సోదరులకు సహాయం చేస్తున్నాడు (2:16). (f) "అన్ని విషయములలోను ఆయన తన సోదరులవలె" అయ్యాడు (2:17). కాబట్టి, యేసు దైవం అయినా గాని, అన్ని విషయములలో ఆయన మనుష్యునిగానూ ఉన్నాడు![2] క్రైస్తవులయిన ప్రతి ఒక్కరు ఆయన దైవత్వం మరియు మానవత్వం అనే రెండు సత్యాలను అంగీకరించాలి.

యేసు మానవుడు అన్న సత్యంలో మనకు కనబడే ఆచరణాత్మక ప్రాముఖ్యత ఏమిటి? హెబ్రీ గ్రంథకర్త దీని జవాబును అందిస్తున్నాడు. హెబ్రీయులకు 2:17, 18ను మరలా చదవండి. యేసు మనుష్యుడవడం వలన పర్యవసానం ఏమంటే, ఆయన మనుష్యునిగా అనుభవంనొందినందువలన ఆయన మనకు పరిపూర్ణ ప్రధాన యాజకుడు కాగలిగాడు. "తాను శోధింపబడి శ్రమపొందెను గనుక శోధింపబడువారికిని సహాయము చేయగలవాడై యున్నాడు" (2:18). తరువాత గ్రంథకర్త యిలా వ్రాస్తున్నాడు,

> మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము (4:15, 16).

## యేసుని మానవత్వము ఎందుకు ప్రాముఖ్యము?

యేసు పరిపూర్ణ మానవుడు కాబట్టి మనవలెనే అన్ని సమస్యలు, శోధనలును ఎదుర్కొని అనుభవించాడు. అందుకనే మన బలహీనతలలో మనయందు కనికరపడుతున్నాడు. అంతేగాక మనయందు కనికరపడే ప్రధాన యాజకుడు మన నిమిత్తం విజ్ఞాపన చేయుచున్నాడని ఎరిగి

ధైర్యముతో కృపాసనము యొద్దకు చేరుకొనగలము.

యేసు దైవత్వం కలిగిన దేవుని కుమారుడు కాబట్టి ఆయన చెప్తున్న మాటకు మనం లోబడియుండాలి. అలా కాని పక్షంలో మనం శిక్షించబడతాము. అన్ని విషయములలో మనవలెనే ఉన్న ఆయననుబట్టి మన సమస్యలు, శోధనలు, బలహీనతలు ఆయన ఎరిగి మన నిమిత్తం చేస్తున్న విజ్ఞాపననుబట్టి మనం దేవుని యొద్దకు ధైర్యముగా వెళ్ళవచ్చును.

శ్రద్ధ మరియు ధైర్యము: ఈ సుగుణాలు మన జీవితంలో క్రీస్తు దైవత్వము మరియు మానవత్వమును బయలుపరచాలి. దైవిక క్రీస్తు మాటలను విని వాటికి విధేయులైయుండుటకు మనం శ్రద్ధకలిగియుండాలి. అలాగే మన బలహీనతలపట్ల కనికరం చూపే కనికరపడే మన ప్రధాన యాజకుడు మన నిమిత్తం విజ్ఞాపన చేయుచున్నాడు కాబట్టి ధైర్యముతో మనం దేవుని సమీపించాలి!

## ముగింపు

"దేవుని కృపవలన క్రీస్తు ప్రతి మనుష్యుని నిమిత్తం మరణము అనుభవించాడు" (2:9) అన్న గొప్ప సత్యమును హెబ్రీయులకు 2 బోధిస్తుంది. "మరణముయొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును" మరియు "జీవిత కాలమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును ఆయన చనిపోయాడు" (2:14, 15). ఆయన ప్రతి ఒక్కరి నిమిత్తం చనిపోయాడు: అనగా పాపపు దాస్యమునుండి విడిపించబడునట్లు నీ నిమిత్తం ఆయన చనిపోయాడు.

దీని గురించి నీవు ఏం చేయదలచావు? "సర్వాధికారము" గలవానికి నీవు విధేయుడవైయుంటావా (మత్తయి 28:18)? యేసునందు నమ్మికయుంచి, నీ పాపములను ఒప్పుకుని, నీ విశ్వాసమును వెల్లడిచేసి, క్రీస్తులో బాప్తిస్మం నొందుటద్వారా నీవు ఆయన మాటకు విధేయుడవైయుంటావా? పరలోకంనుండి మాట్లాడు వానిని నీవు తిరస్కరిస్తున్నావా? ఇంత గొప్ప రక్షణను నీవు నిర్లక్ష్యం చేస్తే నీవేలా తప్పించుకుంటావు? నీవు తప్పించుకోలేవు. నీ పాపములను బట్టి నీవు శిక్షించబడతావు. ఇది నీకు జరుగనియ్యకు! నీకొరకు చనిపోయిన వానికి నీవు విధేయుడవైయుండు. ఆయన యొద్దకు రా.

---

సూచనలు

[1]ఈ ప్రసంగమును "దైవిక క్రీస్తు" మరియు "మానవ క్రీస్తు" అన్న రెండు భాగములుగా చేయవచ్చు. ఒకటి ఆదివారం ఉదయమున మరొకటి ఆదివారం సాయంత్రం చేయవచ్చు. [2]అయితే ఒక్క తేడా ఏంటంటే, ఇతర మనుష్యులకు భిన్నంగా ఆయన పాపం చేయలేదు. చూడు హెబ్రీయులకు 4:14–16.